# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర



*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ఎవరి సమస్య?

"**పిల్లలకి** పెళ్ళిళ్ళు చెయ్యవా? ఎందుకు ఉన్న డబ్బునంతా ఇలా ఊర్లనీ, టూర్లనీ తగలేస్తున్నావ్? కొంచమైనా బాధ్యత లేకపోతే ఇద్దరాడపిల్లలని ఎలా చూసుకుంటావ్? మీవెనక ఉన్న 'పార్తెనాన్' అంటే ' పెళ్ళి కాని పిల్లల అపార్ట్మెంట్' అని అర్థం ఉందిట కూడా!!" అని రాసి, పక్కనే ఓ స్మైలీ బొమ్మ.

తనూ, పిల్లలూ కలిసి యూరోప్ టూర్ లో తీయించుకున్న ఫోటో పంపిస్తే దానికి వచ్చిన సమాధానం చెల్లెలి దగ్గరనించి. రాసిన చెల్లెలికి అది ఓ జోక్ లా అనిపించి ఉండవచ్చు కానీ..అది చూసి పద్మిని మనసు బాధగా మూల్గింది.

" ఇట్ ఈజ్ ఓకే మా, పిన్ని సంగతి తెలియనిదేముంది?" అంది విషయం తెలుసుకున్న పెద్ద పిల్ల దీపిక ఫోన్ చేతిలో పట్టుకుని దిగులుగా కూర్చున్న తల్లితో.

" ఏమయింది అమ్మకి? మనం బయటకి భోజనానికి వెళ్దామనుకున్నాం కదా అమ్మా? ఇంకా అలాగే కూర్చున్నావేం? త్వరగా బట్టలు మార్చుకో, ఆకలి " అంది రెండో కూతురు కీర్తి గారంగా.

పద్మిని మాట్లాడలేదు. నెమ్మదిగా మంచమ్మీంచి లేచి బాత్రూం కివెళ్ళింది. వేడినీళ్లతో ముఖం కడుక్కునేసరికి కొంత సేద తీరినట్టనిపించింది. త్వరగా తయారయ్యి రూములోకి వచ్చేసరికి కూతుళ్ళిద్దరూ ఏదో గుసగుసలాడుకుంటున్నారు. వాళ్ళిద్దరినీ చూసి చిరునవ్వు నవ్వింది.

" అమ్మయ్యా, గంటయింది నువ్వు నవ్వి" అంది దీపిక నవ్వుతూ.

" అమ్మా, ఇంకా ఎన్నాళ్ళు ఇలాంటివన్నీ పట్టించుకుంటావు? మన జీవితం మనిష్టం వచ్చినట్టు జీవిస్తాం అనుక్కో, ఎంత హాయిగా ఉంటుందో చూడు" అంది కీర్తి కూడా నవ్వుతూ..

"నిన్నటి చిన్నపిల్లలు ఈరోజు నాకే నీతులు చెప్తున్నారు" అనుకుంది కూతుళ్ళని చూస్తూ.

"కమాన్ గాల్స్, ఆకలి.. అక్కా, రెస్టారెంట్ లో టేబిల్ ఉంటుంది ముందే బుక్ చేసావు కదా, అది నీ డ్యూటీయేగా? సెకండ్ ఫ్లోర్ టెర్రస్ మీద కదా? జస్ట్ వాంట్ టూ కంఫర్మ్.."

" చేశాను తల్లీ, ఏక్రోపోలీస్ వ్యూ అని మరీ మరీ చెప్పాను కూడా" అంది దీపిక చెల్లెలివైపు చూస్తూ..

ముగ్గురూ గ్రీసుదేశంలోని ఏథెన్స్ నగరంలో ఉన్నారు. పొద్దున్నే ఏక్రోపోలీస్ అనే కొండలాంటి ప్రదేశం మీదున్న పార్థెనాన్ అనే ప్రఖ్యాత కట్టడాన్ని చూసి వచ్చారు. అక్కడకి దగ్గరలో ఉన్న స్ట్రోఫీ అనే రెస్టారెంట్ కి భోజనానికి వెళ్ళాలని ముందే అనుకున్నారు. అక్కడ మేడమీద కూర్చుని భోజనం చేస్తూ ఉంటే ఏక్రోపలిస్, పార్తెనాన్ అందాలన్నీ కనిపిస్తాయి. అక్కడ భోజనం చెయ్యడం నిజానికో గొప్ప అనుభవం. అన్నీ త్వరగా నెట్ లో చూసి ప్లాన్ చేసే అలవాటున్న పిల్లలిద్దరూ ఇవన్నీ ముందే ఆలోచించి ప్రణాళిక వేశారు.

వాళ్ళు టేబుల్ బుక్ చేసుకున్న టైముకి కాస్త ముందుగానే అక్కడకి చేరుకున్నారు. వాతావరణం చాలా ఆహ్లాదంగా ఉంది. సున్నగా మెరుస్తున్న వెన్నెల, చల్లగా వీస్తున్న గాలి. వెన్నెల వెలుగులో మెరిసిపోతున్న పరిసరాలు. కాసేపు పద్మజ కూడా మనసులో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలన్నింటినీ పక్కన పెట్టి పిల్లలతో కలిసి సరదాగా ఉంది.

పొడుగ్గా ఉన్న ఎర్రటి పువ్వుల స్కర్ట్, దానిమీద తెల్లటి టాప్ వేసుకుంది ఆమె. పిల్లలిద్దరూ కూడా చక్కటి డ్రెస్ లు వేసుకున్నారు. ముగ్గురినీ కొత్తగా చూసినవారెవరైనా అక్కా చెల్లెళ్ళనుకుంటారు తప్ప తల్లీ కూతుళ్ళనుకోరు.

" అమ్మా, నీకీ స్కర్ట్ చాలా బాగా సూట్ అయింది" అంది దీపిక

" కానీ కొంచం పొడుగైంది" అంది కీర్తి నవ్వుతూ.

పద్మిని కూడా నవ్వేసింది. " నాకర్థం ఐంది నీ ఉద్దేశ్యం, నేను పొట్టి స్కర్ట్ లు వేసుకోను నువ్వెంత చెప్పినా సరే" అంది నవ్వుతూ.

" మా ఇద్దరికంటే నువ్వు బావుంటావమ్మా,నిజానికి నీకే డ్రెస్ అయినా భలే నప్పుతుంది. అయినా నువ్వేమో ఇలాంటివన్నీ చెప్తూ ఉంటావు. ఎందుకు ఇలాంటి పిచ్చి రూల్స్ అన్నీ పెట్టుకుంటావు నీకు నువ్వే?" అంది కీర్తన కోపంగా.

" నువ్వు కూడా పిల్లలతో సమానంగా పాంట్లూ, స్కర్ట్ లూ ఏవిటొదినా? అన్నయ్యుండగా ఎప్పుడూ లేవు ఇవి" ఆడపడుచు అనే సన్నాయి నొక్కుల మాటలు మనసులో మెదిలాయి.

ఇప్పుడలాంటివన్నీ గుర్తు తెచ్చుకుని తన మూడ్ పాడు చేసుకుని పిల్లల మూడ్ పాడు చెయ్యడం ఎందుకని ఏమీ అనలేదు ఆమె.

సరదా మాటల్లో భోజనం ముగించి కాసేపు వెన్నెల్లో నడవడం మొదలు పెట్టారు ముగ్గురూ. వేసవి కాలం కావడాన హాయిగా ఉంది, ఎప్పుడూ చలిగా ఉండే యూరోప్ దేశాల్లో వేసవి బావుంటుంది. ఇరవైనాలుగు డిగ్రీల ఉష్ణోగ్రతలో మెల్లగా వీస్తున్న గాలి హాయిగా ఉంది. వెన్నెల పిండారబోసినట్టుంది.

' అమ్మా, నిన్నొకటి అడగనా?" అంది దీపిక సడన్ గా, తల్లికీ చెల్లెలికీ మధ్యలోకొస్తూ..

" ఏడున్నరకి మూసేస్తారు ఏక్రోపోలిస్, త్వరగా నడవండి మళ్ళీ చూడాలంటే. ఇవన్నీ రూములో మాట్లాడుకోవచ్చు" అంది కీర్తి హడావిడిపెడుతూ.

ముగ్గురూ మౌనంగా, గబ గబా నడవసాగారు.

పద్మిని కి తెలుసు దీపిక అడగుదామనుకున్నదేమిటో. దీపికొక్కర్తే కాదు, కీర్తి కూడా ఎన్నో సార్లు అడిగింది.

'జీవితంలో ఆటుపోట్లని ఎంతో ధైర్యంగా ఎదుర్కొన్న నువ్వు ఎవరో అనే చిన్న చిన్న మాటలకి ఇంతగా స్పందించి బాధపడతావెందుకు?" అని.

" ఆ ప్రశ్న తనని తనూ చాలా సార్లు వేసుకుంది, కానీ సమాధానం లేదు తనదగ్గర కూడా. నీళ్ళల్లో పడేస్తే మునగడమో, మొండిగా ఈదుకుంటూ పైకి తేలడమో రెండే మార్గాలున్నలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు రెండోది ఎంచుకుని నిలబడింది. పిల్లలకి కావలసినవన్నీ సమకూర్చి పెద్దవాళ్ళని చేసింది. అయినా మార్దవం కోల్పోని మనసు ఇలాంటి విమర్శలకి మరింత మెత్తపడుతూ, బాధపడుతూనే ఉంటుందా? అది కూడా తన వాళ్ళు అనుకునేవారే దానికి కారణమైతే మరీ "తనకే తెలీదు.

పిల్లలకి పెళ్ళి చెయ్యాలన్న విషయం తనకి తెలీదా? ఆ మాత్రం తెలియకుండానే యాభై ఏళ్ళుదాటాయా తనకి? ఆ ముక్క రాసేముందు చెల్లెలొక్క నిమిషం ఆలోచించలేకపోయిందా? అనుకుంటే బాధగా అనిపిస్తుంది.

తనకి ఇరవై ఏళ్ళు, సుదర్శన్ తో పెళ్ళి జరిగేనాటికి. అప్పుడే డిగ్రీ పూర్తయ్యి, పై చదువులు చదవాలని అనుకుంటున్న సమయం..

"నీవెనక ఇద్దరున్నారు కదా, అమ్మా, మంచి సంబంధం, పిల్లవాడు యూనివర్సిటీలో లెక్చరర్, అందరికీ ఇష్టమై, పరిస్థితులనుకూలిస్తే నువ్వు చదువుకోవడానికడ్డేముంది?" అన్న నాన్న మాటలకి ఎదురుచెప్పలేకపోయింది.

అందరికీ ఇష్టమైతే?? అన్న మాట దగ్గర.' చదువుకునేది నేను కదా, ఇష్టపడడానికి అందరూ ఎవరు? 'అని అడగలేకపోయింది. అలా అడగమని నేర్పింది సుదర్శన్.

" నువ్వెవ్వరితోనూ పోట్లాడి నీ అభిప్రాయాన్ని సమర్ధించుకోనక్కరలేదు పద్మినీ! చివరికి నాకు కూడా నువ్వేమీ చెప్పి ఒప్పించక్కరలేదు. నువ్వు చేసేది రైటని నీ మనసుకనిపిస్తే చాలు. నువ్వు చేసే పనిమీద శ్రద్ధా, పూర్తి చెయ్యాలనే పట్టుదలా ఉండడం, అన్నింటికంటే ముఖ్యం" అన్నాడు.

వెంటనే పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో చేరింది. ఆపైన సుదర్శన్ పనిచేసే విభాగంలోనే అతనికన్నా సీనియర్ ప్రొఫెసర్ దగ్గర పీ.హెచ్ డీ. కూడా పూర్తి చేసింది. కొన్నాళ్ళు కాలేజీలో లెక్చరర్ గా పనిచేసింది. ఆపైన ఒక పెద్ద అమెరికన్ కంపెనీలో ఉద్యోగం రావడంతో అక్కడ చేరింది. అప్పటికి దీపిక, కీర్తన చిన్నపిల్లలు.

సుదర్శన్ ప్రొఫెసర్ అయ్యాడు. చింతలు లేని సంసారం, సంస్కారవంతమైన జీవితం. హాయిగా ఉండేవారు. అంతలోనే అనుకోకుండా యాక్సిడెంట్ లో సుదర్శన్ మరణం ఆమె జీవితంలో కోలుకోలేనంత దెబ్బగా ఎదురయింది. పన్నెండు, ఎనిమిది వయసున్న పిల్లలు. తన ధైర్యం, తన బలం అయిన అతను దూరమవడం అనేది ఆమెకి మామూలు దెబ్బ కాదు. కానీ తట్టుకొని నిలబడింది. "ఆడపిల్లలని పెట్టుకుని ఇంత పెద్ద సిటీలో ఒక్కదానివీ ఏముంటావు? మన ఊరికొచ్చెయ్యి" అని బంధువులన్నా ఆమె పిల్లల భవిష్యత్తుకోసం అక్కడే ఉందామని నిర్ణయించుకుంది. కష్టమే, కానీ అసాధ్యం కాదు కదా అనుకుంది. కావాలంటే అతని ఉద్యోగం ఆమెకిస్తానన్నా వద్దనుకుంది.

" ప్రొఫెసర్ ఉద్యోగం, హాయిగా ఉంటుంది కదా ప్రైవేట్ ఉద్యోగం కన్నా' అన్నారు బంధువులు. కానీ అతను రోజూ తిరిగి, మసలిన జ్ఞాపకాలని అక్కడే ఉంటే ఆమె మరిచిపోలేదు. అందువల్లే తను చేస్తున్న ఉద్యోగంలోనే ఉండిపోయింది. కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారంతో పరిస్థితులని చేతిలోకి తెచ్చుకుంది.

"వదినా ఇలా అన్నానని ఏమీ అనుకోవుగా! డబ్బులు అవీ బాగానే వస్తాయిగా, అయినా మనకున్నది చాలదా! ఇప్పుడునువ్వీ ఉద్యోగం మానేస్తే సరిపోతుంది కదా! ఇంట్లో ఉండి హాయిగా పిల్లలిద్దరినీ చూసుకోవచ్చుగా" అంది ఆడపడుచు సుమన.

" నేను ఉద్యోగంలో కొనసాగుదామనుకున్నది కేవలం డబ్బు కోసం కాదు సుమనా! నన్ను నేను బిజీగా ఉంచుకోవడం కోసం. ప్రస్తుతం నేనున్న పరిస్థుతుల్లో తీరిక అనేది నాకు వద్దనుకున్నాను. రోజంతా పని ఉంటే బావుంటుంది. అంతే!" అంది స్థిరంగా. ఆవిడ మాట్లాడలేదు, అయినా పద్మిని పట్టించుకోలేదు.

తన ఆఫీసుకు దగ్గరలో ఫ్లాట్ కొనుక్కుంది బావగారి సహాయంతో పిల్లలిద్దరినీ దగ్గరలో ఉన్న మంచి స్కూల్ కి మార్చింది. ఆఫీసుకి, స్కూళ్ళకీ కూడా నడిచి వెళ్ళేదూరం కావడానా ముగ్గురూ కలిసి పొద్దున్నే వెళ్ళిపోయేవారు. సాయంత్రం వీలైనంత త్వరగా రావడానికి ప్రయత్నించేది. పని మిగిలితే ఇంట్లోనించి చేసుకునేది. పిల్లలతో వీలైనంత ఎక్కువ సమయం గడపడం, వాళ్ళతో కలిసి ఆటపాటలు, పండగలూ, పబ్బాలు, ఆర్ట్ వర్కులూ లాంటివాటితో ఎప్పుడు బిజీగా ఉండేది.

ఊర్లో నే ఉన్న అక్కా, చెల్లి తనూ తరచూ కలుసుకునే వారు. చిన్న ఆడపడుచు సుమనని కూడా. నాలుగైదు రోజులు శలవొస్తే పిల్లలని తీసుకుని దగ్గరలోని టౌన్ లో ఉన్న ఆడపడుచు, బావగార్ల ఇళ్ళకి వెళ్ళేది.

" బావుందమ్మా, నాకు చాలా ఆనందంగా ఉంది నిన్నూ, పిల్లలని చూస్తుంటే. వాడు లేకపోయినా ఎంతో బాగా పెంచుతున్నావు. మన పల్లెటూర్లో మంచి చదువులు లేవు, నేను రాను బావగారు అని నువ్వు ఆరోజు అనడం ఎంత కరక్టో నాకిప్పుడర్థం అవుతోంది" అనేవాడు ఆయన.

తోడికోడలు కూడ " ఎప్పుడేది కావాలన్నా మరో ఆలోచన లేకుండా అడుగు పద్మినీ " అనేది

ఊర్లో ఉన్న పెద్ద ఆడపచు తన కొడుక్కి దీపిక ని చేసుకుంటానంటే సున్నితంగా వద్దని చెప్పింది. “అమ్మాయి ఇంకా చదువుకుంటోంది, దానికిష్టమైనంతవరకూ చదివిస్తాను, పైగా దగ్గర సంబంధాలు చెయ్యడం శాస్త్ర రీత్యా మంచిది కూడా కాదు" అంది. ఆవిడకి చాలా కోపం వచ్చింది.

" పోన్లే వాడు లేకపోయినా సంబంధం కలుపుకుందామని ఆశపడ్డాను. నీస్థాయికి మేము తగమనుకుంటే ఆ మాటే చెప్పెయ్యి, ఈ డొంకతిరుగుడెందుకు? అంది. తర్వాత కొన్నాళ్ళు ఆవిడ పద్మినితోటీ, పిల్లలతోటీ మాట్లాడలేదు కూడా. ఆవిడకర్థం అయ్యేలా ఎలా చెప్పాలో పద్మినికి అర్థం కాలేదు.తోడికోడలి దగ్గర చెప్పి బాధపడింది.

" పరవాలేదులే పద్మిని, ఆవిడ మాటలు మనకి తెలియనివా? కృష్ణ చాలా మంచివాడు. డిగ్రీదాకా చదువుకున్నాడు, అలాగని నీకిష్టం లేకుండా పిల్లనెలా ఇస్తాం?" అందావిడ.

" కష్టసుఖాల్లో తోడుగా ఉండేదే కుటుంబం పద్మిని, అది కుటుంబ సభ్యుల బాధ్యత, తద్వారా వచ్చే హక్కులంటూ ఏమీ ఉండవమ్మా, నీకు, పిల్లలకీ సంబంధించినంతవరకూ అన్ని నిర్ణయాలు మీవే" అన్నారు బావగారు కూడా. ఆ మాటలని కానీ, వాటివెనక ఉన్నపరిణతిని అర్థం చేసుకున్నాకా ఆయనంటే గౌరవం రెట్టింపయిందామెకి.

అలా చూస్తూ ఉండగానే సుదర్శన్ లేకుండా పన్నెండేళ్ళు గడిచిపోయాయి. పిల్లలు పెద్దవాళ్ళయ్యాకా ముగ్గురూ కలిసి సినిమాలకీ, హోటళ్ళకీ వెళ్ళేవారు. మొదటినించీ ట్రెక్కింగ్, హైకింగ్, కాంపింగ్ లాంటి అభిరుచులున్న పద్మిని తరచుగా తన స్నేహితులతో కలిసి పిల్లలని తీసుకుని వెళుతూ ఉండేది. అప్పుడప్పుడు ఒంటరిగా వెళ్ళేది.

ఎదిగిన ఆడపిల్లలని మించిన స్నేహితురాళ్ళుండరు తల్లికి. అన్నీ పంచుకోవడం, అప్పుడప్పుడు అభిప్రాయభేదాలతో తగవులు పెట్టుకోవడం, మళ్ళీ అంతలోనే కలిసిపోవడం, ముగ్గురూ కలిసి కావలసినవి వండుకోవడం లేదా ఆర్డర్ చేసి తెప్పించుకోవడం.. ఇలా సరదాగా గడిపేవారు.

దీపిక మాస్టర్స్ పూర్తి చేసి యూరోప్ లో పిహెచ్ డీ చెయ్యడానికి వెళ్తానంది. తను సంతోషంగా సరేనంది. " యూరోప్ లో తొందరగా అవుతుందమ్మా రిసెర్చ్. నువ్వు కీర్తి కూడా రావచ్చు నా దగ్గరకి. ఎక్కువ దూరం కూడా కాదూ" అంది.

అంతకుముందు ఆడపడుచులు మాత్రమే అనేవారు తరచుగా పిల్లల పెళ్ళిళ్ల గురించి, దీపిక వెళతానన్నప్పటినించీ చెల్లెలు కూడా " ఎందుకక్కా, ఒక్కదాన్నీ పంపడం, హాయిగా పెళ్ళి చేస్తే వాళ్ళే చూసుకుంటారు కదా?" అనడం మొదలు పెట్టింది. పెళ్ళి చేసాకా దాని ఇష్టం సాగకపోతే? నాకు జరిగినట్టు అందరికీ జరగాలని లేదు కదా. స్వేచ్ఛగా దానికి కావలసినది చదువుకున్నాకే చేద్దాం పెళ్ళి అంది చెల్లెలితో.

దానికి తోడు కీర్తి తనకి పాప్ సింగర్ అవ్వలన్న కోరిక అని చెప్పడం, దాన్ని కూడా తను ప్రోత్సహించడం ఎవరికీ నచ్చలేదు. కీర్తికి మొదటినించి పాటలమీద ఆసక్తి ఎక్కువ, కర్నాటక సంగీతం కొన్నాళ్ళు నేర్చుకుంది కానీ క్రమ క్రమంగా ఆమెకి పాశ్చ్యాత్య సంగీతం లో ఆసక్తి, అభినివేశం ఎక్కువయింది. దానితో అందులోనే శిక్షణ తీసుకొవడం మొదలుపెట్టింది. త్వరలోనే తన స్నేహితులతో కలిసి ఒక బాండ్ మొదలుపెట్టింది. ఒక పక్క డిగ్రీ చదువుతూనే ఇవన్నీ చేసేది. మొదట పెద్ద షాపింగ్ మాల్స్ లోనూ, రెస్టారెంట్స్ లోనూ పాడేవారు ఆమె, స్నేహితులూ కలిసి. అదెవరికీ నచ్చలేదు ఇంట్లో.

వారికీ సమాధానం చెప్పలేక," అక్క ఏదంటే దానికి సరే అన్నావు, నన్ను మాత్రం వద్దంటావా? అన్న కూతురికీ జవాబు చెప్పలేక మధనపడింది కొన్నాళ్ళు. ఆ తర్వాత తాము అభిమానించే గాయనీ గాయకులందరూ తమ ఇళ్ళల్లో ఇలాంటి పరిస్థితులెదురై అడ్డం పడితే ఇంత ప్రసిద్ధి చెందేవారా? అనుకుంది. ఆ మాటలోనే సమాధానం దొరికింది ఆమెకి. . నగరంలో జరిగే పోటీలన్నింటిలో దాదాపుగా బహుమతులు గెల్చుకునే ఆమెని మురిసిపోయే సమయాలో మరో ఆలోచనే రాలేదు పద్మినికి.

అలా పిల్లలిద్దరూ తమకిష్టమైన రంగాల్లో రాణిస్తూ ఉండడం ఆమెకి సంతోషంగా ఉంది. తనకి యాభై రెండు సంవత్సరాలు రాగానే రిటైర్ అవ్వాలన్న నిర్ణయం ఎప్పుడో తీసుకుంది, అందువల్ల పుట్టినరోజయిన నెలరోజులకి రిజైన్ చేసింది.

అప్పుడు ఉద్యోగం చెయ్యాలా? అన్నవాళ్ళే ఇప్పుడు అన్ని లక్షలొచ్చే ఉద్యోగాన్ని వదిలేసుకోవడం ఎందుకు? అన్నారు.

కీర్తి వాళ్ళ బేండ్ మొదటి విదేశీ ప్రదర్శన, దీపిక పి.హెచ్ డీపూర్తి చేసుకుని అవార్డ్ తీసుకునే సమయానికి దగ్గరలోనే కుదరడంతో ముగ్గురూ యూరోప్ లో కలిసి అక్కడనించి చుట్టుపక్కల ప్రదేశాలన్నీ చూసేలా ప్లాన్ చేసుకున్నారు. అదే ఈ ప్రయాణం.

కూతుళ్ళతో కలిసి ముందుకు నడుస్తూనే ఆమె వెనక్కి వెళ్ళి అన్నీ గుర్తుచేసుకుంది.

" అమ్మా! ఇంకా అదే ఆలోచిస్తున్నావా?" అంది దీప్తి నెమ్మదిగా తల్లి చెయ్యి పట్టుకుంటూ.

మాట్లాడలేదు పద్మిని. చిన్నదైనా ఇందాకా కీర్తి చెప్పిందిగా అమ్మా, మన జీవితం ఇది, మనిష్టం అని. ఒక్కసారి అనుకుని చూడు. మరో ప్రశ్న మిగలదు. నిజమేనా?" మళ్ళీ దీప్తే అంది అక్కడున్న రాళ్ళమీద కూర్చుంటూ.

ఇప్పుడున్న సమస్య నా పెళ్ళే అయితే ఇప్పుడు నువ్వెవరిని చూపిస్తే అతన్ని పెళ్ళి చేసుకోవడానికి నేను రెడీ. చెప్పు, అది నీ సమస్యా? లేక ఇతరులదా? మరొకరిదైతే మనం పట్టించుకోనక్కరలేదు. మేమెప్పుడూ ఏదీ అడగకుండానే మాకన్నీ అమర్చావు, నీ జీవితంలో ఎంతో భాగం మాకోసమే జీవించావు. చదువు, హాబీలు, వ్యక్తిత్వం, స్వతంత్రత అన్నీ ఉన్న ఒక సంపూర్ణ మహిళ ఎలా ఉండాలో అలా ఉండి మాఇద్దరికీ రోల్ మోడల్ గా నిలిచావు. అలాంటి నువ్వు ఇలాంటి చిన్నవిషయాలకి బాధ పడతావంటేనే నాకెంతో ఆశ్చర్యంగా ఉంటుంది తెలుసా? అది కూడా నేనడిగేవరకూ ఎవరితోనూ చెప్పకుండా ఒంటరిగా కూర్చుని మరీ. చెప్పమ్మా, నా పెళ్ళి అనేది నీ సమస్యా? పిన్ని లేదా మన ఇతరబంధువుల సమస్యా? దాన్ని బట్టి మనం పరిష్కారం ఆలోచిద్దాం" అంది దీపిక రవ్వంత ఆవేశంతో.

"అవునమ్మా, అక్క చెప్పింది కరక్టే కదా!" అంది కీర్తి కూడ.

" మా మంచి చెద్దలు నీకన్నా ఎవరికీ ఎక్కువ తెలీదనేది మా నమ్మకం, విశ్వాసం. అందుకని నువ్వు మరో ఆలోచనలేమీ పెట్టుకోకు. నువ్వు ఎప్పుడు ఏది ఎలా కోరుకుంటే అలాగే జరుగుతుంది. నువ్వు ఒక్క మాట చెప్పు చాలు, మేమిద్దరం సరే అంటాం. చాలా లేట్ అయింది, పదండి హోటల్ కి వెళదాం, నిద్రొస్తోంది" అంది దీప్తి నవ్వుతూ వాతావరణాన్ని తేలిక చేస్తూ.

కూతుళ్ళిద్దరి చేతుల్లో చేతులు కలిపి నడిచింది పద్మిని.

COMMENTS